# దిక్సూచి



కొటూరి రవీంద్ర త్రివిక్రమ్

"ఈ ఉత్తరమే టెలిగ్రామ్‌గా భావించి తక్షణం బయలుదేరి రాగలవు. వివరాలు సమక్షంలో—

నీ

కవిత"

అప్పుడే తలుపు తీసి అడుగు లోపలికి వేయగానే, నేలమీద పడున్న కార్డుమీద కనుపించిన వాక్యాలవి. సావిత్రి ఆ కార్డు నలాగే చేతిలో పట్టుకుని సాలోచనగా నిలబడిపోయింది. కవిత ఎప్పుడూ ఇలాంటి ఉత్తరాలు రాయలేదే!

ఏమిటీ ఉత్తరాని కర్థం?

ఇప్పుడు తనేం చెయ్యాలి?

చేతిగడియారం కేసి చూసుకుంది. మూడు గంటలవుతోంది. శనివారం గనుక 'బ్యాంకు' నుండి త్వరగానే ఇంటికొచ్చింది. కవిత ఉండేది విజయవాడలో. తనుంటున్నది గుంటూరులో. ఇద్దరికీ ఒకేమాటు బ్యాంకులో సెలక్షను వచ్చినా, పోస్టింగ్స్‌లో చెరొక ఊరు పడింది. తమది బాల్యస్నేహం. డిగ్రీ చదువుదాకా ఒకే క్లాసు. తర్వాత ఉద్యోగంలో జేరటం జరిగాక ఉత్తరాలే తమ మధ్య వారధిగా నిలిచాయి. మధ్య మధ్య సొంతఊరులో పండగలప్పుడు కలుసుకోవటం ఎంతో ఊరటగా ఉండేది.

సావిత్రి ఆలోచనలు విరమించి ఆచరణలోకి దిగింది. చకచక తయారయి బస్‌స్టాండుకి బయలుదేరింది.

* * *

"నువ్వు వెంటనే వస్తావని నాకు తెలుసు. అందుకే ఇంత నిబ్బరంగా ఉన్నాను.... ముందీ కాఫీ తాగు."

సోఫాలో విశ్రాంతిగా వెనక్కువాలి కవిత అందించిన కాఫీ చప్పరిస్తూ ఉండిపోయింది సావిత్రి.

"అవసరమయితే రెండు రోజులు ఉండేందుకు ఏర్పాట్లు చేసుకొచ్చావా?"

"అవసరం ఉంటుందంటావా?"

"ఒకవేళ ఏర్పడితే?"

"ఫరవాలేదు. పోస్టుద్వారా లీవు లెటరు పంపిస్తాను."

"అదే నే నడిగేది. మళ్లీ వెంటనే పరుగెత్తాల్సిన అవసరం లేకుండా ఉంటే చాలు ..."

"అసలింతకీ ఏమిటి సమస్య? ఏదైనా పెళ్లిగొడవా?"

"అలాంటిదే. కానీ, అది కాదు."

"అదేమిటో ముందు చెప్పు. నీ ఉత్తరం అందిన దగ్గర్నుంచి ఇంతవరకు విషయమేమిటో అర్థంగాక సస్పెన్సుతో సతమతమయిపోతున్నాను...."

కవిత నవ్వింది.

"చెప్పటానికే గద నిన్ను రమ్మని రాసింది. నువ్వు ఊరికే వింటే చాలదు. చక్కని సలహా కూడ యివ్వాలి."

"సలహా యివ్వగలను గానీ, చక్కని సలహా సంగతి చెప్పలేను..." చమత్కారంగా నవ్వింది సావిత్రి.

కవిత కూడ నవ్వేసింది.

కాఫీ కప్పు పక్కన పెడుతూ "ఇక చెప్పు" అంది సావిత్రి.

"ఒక్కక్షణం" అంటూ లేచివెళ్లి బీరువాలోంచి ఉత్తరాల కట్ట తీసుకొచ్చింది.

వాటిని సావిత్రి చేతిలో ఉంచి "ముందివి చదువు...." అంది.

సావిత్రి వాటిని ఆశ్చర్యంగా చూసి, "ఏమిటీ.... ఇవన్నీ చదివితే గానీ నీ సమస్య నాకు అర్థంకాదా?" అంది.

"అవునంతే" అంది కవిత మందహాసంతో.

"ఎందుకు నన్ను శిక్షిస్తావ్ గానీ— విషయమేదో నీ మాటల్లో చెబుదూ, పుణ్యం ఉంటుంది."

"ప్రేమలేఖలనగానే ఎవరయినా ఎగిరి గంతేసి మరీ చదవటానికి ఎగబడతారు. నువ్వేమో చూట్టానిక్కూడా బద్ధకిస్తున్నావ్" కవ్వించింది కవిత.

"ప్రేమలేఖలా ఇవి? చెప్పావు కాదేం? అయితే ఇందులో ప్రేమ తప్ప అన్నీ ఉంటాయి."

"అన్నీ అంటే?"

"ఏముందీ— కవిత్వం, కపిత్వం, కాపీ తత్వం, వెరశి పైత్యం."

గొల్లున నవ్వింది కవిత.

"నువ్వు భలే చెబుతావే.... మరినూ! పాపం— ఆ ఉత్తరాలు రాయటాని కెంత

శ్రమపడ్డాడో ఎంత కాలం వెచ్చించాడో ఆలోచించావా?"

"పిచ్చి కవితా! అదే నీకూ నాకూ తేడా. ఒక చేపని పట్టుకోవటానికి గాలం వేసి గంటల తరబడి ఓపిగ్గా కూర్చునే వాడికీ, ఓ పిల్లని లోబరుచుకోవటానికి నానా బాధలూ పడేవాడికీ నా దృష్టిలో తేడా ఏమీలేదు."

"అంతేనంటావా?"

"అక్షరాలా అంతే! ఇంతకీ నీ కథలో బెస్తవాడెవరు? ఆ సంగతి చెప్పు ముందు. నీ సమస్య అదేనా యింతకీ?"

కవిత నోరు విప్పింది.

* * *

"ఇదేదో కొత్త గడియారంలాగ ఉందే?"

"అవును. నిన్ననే జర్మనీ నుండి నా ఫ్రెండు వచ్చాడు. నాకోసం దీన్ని బహుమతిగా తెచ్చాడు...."

"చాలా బావుంది!"

"థాంక్స్."

"ఇందులో ప్రత్యేకత లేమిటి?"

"ఇది దిక్సూచిగా కూడా పనిచేస్తుంది. ముఖ్యంగా నావికుల కోసం దీన్ని తయారు చేసార్ట...."

"చేతి గడియారంలో దిక్సూచి పెట్టటం నిజంగా గొప్ప సంగతే!"

"విజ్ఞానం చేసే అద్భుతాల్లో ఇది ఒకటి- అంతే!"

"మాధవా!"

"ఊఁ?"

"నేను నీకో సంగతి చెప్పాలను కుంటున్నాను."

"చెప్పు."

"ఇకముందు మనం ఇలా కలుసుకు నేందుకు వీలుకాకపోవచ్చు...."

"నన్ను పరీక్షించాలనుకుంటున్నావా?"

"కాదు- నిజమే చెబుతున్నాను...."

మాధవ్ మాట్లాడలేదు. గంభీరంగా ఉండిపోయాడు.



"నాకు సంబంధం చూశారు మా వాళ్లు. సెటిల్ అయినట్లే దాదాపు...."

"వెరీ ఓల్డ్‌స్టోరీ! చాలా పాతకథ...."

"కథ కాదు.... నిజం...."

"ఊఁ...."

ఒకమాటు సంబంధం ఖాయమయినాక ఇలా తిరగటం బావుంటుందా నువ్వే చెప్పు...."

"బావుండదు మరి!" వ్యంగ్యం ధ్వనించేలా అన్నాడు.

"అందుకని ఇదే మనం చివరిసారి కలుసుకోవటం."

పాము చివ్వున పడగవెత్తినట్టు, ఆమె కేసి దిగ్భ్రాంతిగా చూసేడు.

"చివరిసారా? కవితా-నీకు....నీకు... మతి చెడిపోయిందా? నిన్ను ఒక్కరోజు చూడకపోతే నా మనసు వికసించదే.... నా కలం కదలదే.... నా కళ్లలోకి కాంతి ప్రవహించదే.... ఇవన్నీ తెలిసి కూడా ...."

"నీకు తెలియందేముంది! జీవితంలో ఇవన్నీ మామూలేగా" నిర్లిప్తంగా అంది.

"మామూలా? ఇవన్నీ నీకు మామూలుగా కనిపిస్తున్నాయా? ఎందుకు నన్నిలా గాయపరుస్తావు కవితా! నీ చేత్తో ఏ సైనేడ్ విషమో యివ్వరాదూ? హాయిగా కన్ను మూస్తాను...."

"మాధవా! ఇలా నన్ను వేధించటం నీకు న్యాయమేనా?"

* * *

"అబ్బ.... ఈ సోదంతా దేనికే? ఇంతకీ ఎవడా మాధవుడు? నీకూ అతనికీ అంతగా పరిచయం ఎలా ఏర్పడింది?" సావిత్రి విసుగ్గా అడ్డుకుంది.

"మాధవ్ ఓ కంపెనీలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. మనిషి అందగాడు. చక్కని భావకవి. అద్భుతమనిపించే కవితలు రాశాడు."


"నీమీదేనా?"

"కాదు- ప్రకృతి మీద."

"స్త్రీకి పరోక్షనామం ప్రకృతిలే! ఇక చెప్పు...."

"ఏ ఆడదయినా కోరుకునేది అలాంటి వాడు భర్తగా దొరకాలనే...."

"నేను కోరుకోను! నీలాంటి చవట దద్దమ్మలకి మరో పనిలేక, జీవితాన్ని రంగుటద్దాల్లోంచి చూస్తూ, గమ్యంమరచి




అగుపించిన దోవలో పరుగులు తీస్తారు...."

"నిజమేనే! వయసు చిన్నదయినా నీకున్న లోకానుభవం చాలా ఎక్కువ. అందుకే నిన్ను అర్జంటుగా రమ్మని రాశాను...."

"తీరా వచ్చాక నువ్వు రాసినంత అర్జంటు నాకు కనపడలేదు...."

"కాదు సావిత్రీ! నువ్వు సాంతం విన్నాక అభిప్రాయం చెప్పు. అంత వరకు ఏమీ చెప్పకు...."

"ఆ కవిగారి స్నేహం కాదుగానీ, నీకు పరమ చాదస్తం అబ్బింది. విషయాన్ని సాగదీసి చంపక చప్పున తేల్చిపారెయ్...."

"మాధవ్‌ని నేను మనసారా ఇష్ట పడ్డాను...."

"బ్రతికి పోయావ్! ప్రేమించానంటా వేమో వీపుమీద వాయిద్దామనుకున్నాను."

'నాకు నీ సంగతి తెలుసుగా' అన్నట్టు నవ్వి "అతన్ని పెళ్లిచేసుకునేందుకు నా కెలాంటి అభ్యంతరాలూ లేవు. కానీ...."

"అవకు...."

"అతని భావాలు వేరుగా ఉన్నాయి..."

"వేరుగా ఏముందిలే.... అలాంటి వాళ్ల నేది- నువ్వు నా ఆరాధ్యదేవతవి, నిన్ను పెళ్లిపేరుతో ప్రతిమగా మార్చు కుని, చైతన్యరహితంగా జీవించడాన్ని భరించలేనని! అంతేనా!"

"ఇట్లాగే.... అచ్చం ఇట్లాగే అన్నాడే! నీకేమైనా అతీంద్రియ శక్తులున్నాయా సావిత్రీ! ఇంత ఖచ్చితంగా ఎలా చెబుతున్నావ్?"

ఆమె మొహంలో విషాదం తొంగి చూసింది.

"ఎలాగేముంది కవితా!మా పెద్దక్క- ఇలాంటి విషవలయంలో యిరుక్కు-ని బయటపడలేక, ఎవరెన్ని చెప్పినా విని పించుకోక చివరికి నిరాశతో జీవితాన్ని బలిచేసుకుంది...."

చలించిపోతూ "నిజంగా!!" అంది కవిత.

"అబద్ధం ఎందుకు చెబుతాను! అందుకే నాకు మగజాతి మీద పరమ ద్వేషం. అలాగని అందరిమీదా కాదు. ముఖ్యంగా మాధవ్‌లాంటి వ్యక్తులు తెలివిగా ఉచ్చులుపన్ని మాయమాటలతో కొన్ని జీవితాల్ని కాలరాస్తారు. అది పైశాచిక ప్రవృత్తి. అలాంటి దుర్మార్గుల బారిన ప్రతి నిముషం ఎంతమంది పడుతున్నారో ఊహించలేం. స్త్రీజాతికి పొగడ్తలకి నొంగిపోయే తత్వం ఒక మహాశాపం! అలాంటి తత్వం లేకుండా నిబ్బరంగా వ్యవహరించ గలిగితే మన కెవరూ అపకారం చెయ్యలేరు కవితా! ఇది ముమ్మాటికీ నిజం!" ఆవేశంగా అంది సావిత్రి.

కవిత 'రిలీఫ్'గా నిట్టూర్చింది. "ఏ ప్రదేశంలో ఉన్నా దిక్సూచి ఉత్తర దక్షిణాలే చూపించినట్లు, ఏ పరిస్థితిలో నైనా నిర్మొగమాటంగా నువ్వు మంచిదని నమ్మినదాన్నే నొక్కి- చెబుతావు సావిత్రీ. అందుకే మాధవ్‌ని పెళ్లి వైపుకి మళ్లిద్దామని నేను పడిన తాపత్రయం తెలివితక్కు-వని ఋజువుచేసావు. నీకు చాలా రుణపడి ఉన్నాను. నా సమస్య యిప్పుడు పరిష్కా-రమైనట్లే...."

— — — —